నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 నల్లగొండ, గురువారం 18 జూలై 2024 SURYAPET


# గంజాయి ముఠా అరెస్ట్

నీలగిరి, జూలై 17 : గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. శనివారం హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కారులో అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నారనే విశ్వనీయ సమాచారం మేరకు నల్లగొండ జిల్లా కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద శాలిగౌరారం సీఐ, కేతేపల్లి ఎస్ఐ, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ రమేశ్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఉదయం 10 గంటల సమయంలో సూర్యాపేట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన హుండాయ్ కారులో ఇద్దరు పురుషులు, ఒక స్త్రీ అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని ఆపి తనిఖీ చేశారు. కారు డిక్కీలో గంజాయి ప్యాకెట్లు లభించడంతో వారిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అశోక్‌కుమార్(58), దీపు కుమార్(21), ఢిల్లీకి చెందిన సుష్మారాయ్(33) కారులో ఒడిశాలోని కలిమెల, మల్కాన్‌గిరి వెళ్లి అక్కడ సుశాంత్ వద్ద 89 ప్యాకెట్లలో గంజాయిని కొనుగోలు చేసి హైదరాబాద్‌లో డెలివరీ చేసేందుకు వెళ్తున్నారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రేమ్ సింగ్ ఆదేశాలతో వీరు గంజాయి రవాణా చేస్తున్నట్లు తేలింది.











సూర్యాపేట బొడ్రాయి బజార్‌లో పీర్ల ఊరేగింపు



మేళ్లచెర్వు శివాలయంలో ఏకనామ భజనల్లో పాల్గొన్న భక్తులు

# భక్తి పారవశ్యం

## సంబురంగా తొలి ఏకాదశి.. మోహర్రం వేడుకలు

హిందూ, ముస్లింల పండుగలు ఒకే రోజు కలిసి రావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బుధవారం ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ క్షేత్రాలకు వెళ్లి దైవ దర్శనం చేసుకున్నారు. మరోవైపు మొహర్రం పురస్కరించుకొని పీర్ల ఊరేగింపు సందడిగా కొనసాగింది. డప్పు చప్పళ్ల మధ్య ఇంటింటికీ వచ్చిన పీర్ల సవారీలకు ప్రజలు దట్టీలు, కుడుకలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

# 21న కేవీలో జిల్లా స్థాయి చెస్‌పోటీలు

రామగిరి, జూలై 17: అంతర్జాతీయ చెస్‌డేను పురస్కరించుకొని ఈ నెల 21న ఆదివారం జిల్లాస్థాయి బాల, బాలికల చెస్‌పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కె.కరుణాకర్‌రెడ్డి, ఆర్బిటర్ ఎం.విశ్వప్రసాద్ బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో అండర్ -11, 13, 15 విభాగాల్లో వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత భోజన సదుపాయం కల్పిస్తున్నామని, ప్రతి విభాగంలో విజేతలకు బహుమతులు అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వాట్సాప్ నంబర్ 99854 23823కు ఎంట్రీలు పంపించాలని కోరారు.






# సాగర్‌పై చిగురిస్తున్న ఆశలు

- నిండిన కర్నాటక ప్రాజెక్టులు
- కృష్ణా ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు
- సాగర్‌లో 504.60 అడుగుల్లో నీరు



నాగార్జునసాగర్ జలాశయం ప్రస్తుతం ఇలా..

నల్లగొండ ప్రతినిధి, జూలై 17 (నమస్తే తెలంగాణ) : కృష్ణానదీ ఎగువ ప్రాంతాల్లోకురుస్తున్న భారీ వర్షాలతో కర్ణాటకలోని అన్ని ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. ఆయా ప్రాజెక్టులు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఆల్మట్టి ప్రాజెక్టు గేట్లు తెరుచుకున్నాయి. దిగువన ఉన్న నారాయణపూర్ డ్యామ్ గేట్లు ఎత్తితే ఇక కృష్ణానదిపై రాష్ట్ర పరిధిలోని తొలి ప్రాజెక్టు జూరాలకు వరద నీరు రానున్నది. జూరాలలో కూడా ఇప్పటికే నీరు నిల్వ ఉండడంతో పై నుంచి వరద ఉధృతి కొనసాగితే మూడునాలుగు రోజుల్లోనే జలాలు శ్రీశైలం ప్రాజెక్టుకు తరలిరానున్నాయి. గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం 11 రోజుల ముందుగానే ఆల్మట్టి డ్యామ్ గేట్లు తెరుచుకోవడం విశేషం. దాంతో ఈ ఏడాది పరిస్థితి ఆశాజనకంగానే ఉంటుందన్న అంచనాలతో నాగార్జునసాగర్ ఆయకట్టుపై ఆశలు చిగురిస్తున్నాయి.

వారం రోజులుగా కృష్ణానది జన్మస్థానం మహాబలేశ్వరంతో పాటు పశ్చిమ కనుమల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దాంతో కృష్ణానదిలో వరద ఉధృతితో ప్రాజెక్టులన్నీ ఒక్కొక్కటి నిండుతూ వస్తున్నాయి. కృష్ణానదిపై తొలి ప్రాజెక్టు ఆల్మట్టి పూర్తిగా నిండడంతో మంగళవారం సాయంత్రమే 14 గేట్లు ఎత్తి 65వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఆ తర్వాత ఇన్‌ఫ్లో కొద్దిగా తగ్గి బుధవారం ఉదయం 6గంటలకు ఆల్మట్టికి 61,683 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా నమోదైంది. పవర్ హౌస్ ద్వారా అవుట్‌ఫ్లోగా 17,563 క్యూసెక్కుల నీటిని నారాయణపూర్ డ్యామ్‌కు విడుదల చేస్తున్నారు. ఆల్మట్టికి ఎగువ నుంచి ఏ మాత్రం ఇన్‌ఫ్లో పెరిగినా ఆ నీరంతా దిగువకే విడుదల చేయనున్నారు. నారాయణపూర్ డ్యామ్‌లో సైతం ప్రస్తుతం 37.64 టీఎంసీల కెపాసిటీకి గానూ 28.76టీఎంసీ నీరు నిల్వ ఉంది. ఎగువ వరదను బట్టి డ్యామ్ గేట్లను త్వరలోనే ఎత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ తర్వాత జూరాల ప్రాజెక్టుకు వరద రానుంది. జూరాలలో ప్రస్తుతం 9.66 టీఎంసీకుగానూ 7.66 టీఎంసీ నీరు నిల్వ ఉంది.

**ఇక పైన ఏమాత్రం వానలు కురిసినా..**

ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్టుకు 3,585 క్యూసెక్కుల స్వల్ప ఇన్‌ఫ్లో ఉంది. శ్రీశైలంలో ప్రస్తుతం 215.80 టీఎంసీల నీటి నిల్వకు గానూ 33.62 టీఎంసీలు ఉంది. శ్రీశైలం నుంచి విద్యుత్తు ఉత్పత్తి ద్వారా 30,912 క్యూసెక్కుల నీరు అవుట్‌ఫ్లోగా నాగార్జునసాగర్‌కు చేరుతుంది. దాంతో సాగర్ నీటిమట్టం బుధవారం సాయంత్రం 6గంటలకు 504.60అడుగులకు చేరుకుంది. పూర్తి స్థాయి నీటినిల్వ 312.50 టీఎంసీలకు గానూ 122.68టీఎంసీల నీరు ప్రస్తుతం ఉంది. గతేడాది ఆల్మట్టిలో ఇదే రోజు పరిశీలిస్తే 26టీఎంసీలే ఉండగా ప్రస్తుతం 99.24 టీఎంసీలు ఉండడం విశేషం. నారాయణపూర్, జూరాల, తుంగభద్ర డ్యామ్‌లలో సైతం గతేడాదితో పోలిస్తే ఈ సారి అదనపు నీటి నిల్వలే కనిపిస్తున్నాయి. దీని వల్ల ఇక ముందు ఎగువన ఏ మాత్రం వర్షాలు కురిసినా ఆ వరద శ్రీశైలం వైపునకే రానుంది. ఆ తర్వాత శ్రీశైలానికి వరద మొదలైతే విద్యుత్ ఉత్పత్తి ద్వారా సాగర్‌కు నీటిని విడుదల చేయవచ్చు. అందుకే నాగార్జునసాగర్ ఆయకట్టుపై ఆశలు చిగురిస్తున్నాయి.














